సాక్షి ఖమ్మం
శనివారం । 25 । మే । 2024



సింగరేణిలో ఆస్ట్రేలియా బృందం

ఆస్ట్రేలియాకు చెందిన బృందం కొత్తగూడెంలో సింగరేణి డైరెక్టర్లతో సమావేశమై సాంకేతికత, తదితర అంశాలపై చర్చించింది. 8లో



'కారుణ్య' మిస్టరీ

భద్రాచలంలోని నర్సింగ్ కాలేజీ విద్యార్థిని మృతి చెందగా.. ఆమె బంధువులు, వివిధ సంఘాల నాయకుల ఆందోళనతో అట్టుడికింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
42° / 30°

జిల్లాలో శనివారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత వాతావరణం కాస్త చల్లబడే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జనరల్, ఒకేషనల్ (నాన్ సీఓఈ) జూనియర్ కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. ఈ ఏడాది మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఈనెల 24 నుండి 31వ తేదీవరకు tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా పాలిసెట్



విద్యార్థుల హాల్‌టికెట్లను తనిఖీ చేస్తున్న ఉద్యోగి

ఖమ్మం సహకారనగర్/మధిర: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని ఐదు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 2,591మంది విద్యార్థులకు 2,212మంది హాజరయ్యారని పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకు జరిగిన పరీక్షకు విద్యార్థులను గంటముందు నుంచే అనుమతించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని ప్రకటించడంతో విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. ఇక మధిరలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 410 మంది విద్యార్థుల్లో 359మంది హాజరయ్యారని మధిర పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్యాల రామస్వామి తెలిపారు. రాష్ట్ర పర్యవేక్షకులు కె.వీరాస్వామి, జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, చీఫ్ సూపరింటెండెంట్లు వై.ప్రభాకర్, సీహెచ్.శ్రీహరి పర్యవేక్షించారని వెల్లడించారు.

మధిరలో విత్తన మేళా



కరపత్రాలను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

మధిర: మధిరలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి మాట్లాడుతూ.. విత్తన మేళాలో ఆరు జిల్లాలకు చెందిన 150 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా తమ కేంద్రంలో రూపొందించిన పెసర విత్తనాలు ఎంజీజీ 295, 347, 351, 385 రకాలే కాక మినుములో ఎంబీజీ 1070, పీయూ 31, టీబీజీ 104, కందిలో ఎంఆర్‌జీ 66, 1004 రకాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అంతేకాక వరంగల్ పరిశోధన కేంద్రానికి చెందిన వరి సన్న రకాల్లో స్వల్పకాలిక విత్తనాలైన డబ్ల్యూజీఎల్ 962 కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం తెగుళ్ల బారి నుంచి పంటలను రక్షించుకోవడం తదితర అంశాలను శాస్త్రవేత్తలు వివరించి అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. శాస్త్రవేత్త నాగస్వాతి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు డీబార్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 42కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం, సాయంత్రం జరిగిన ప్రథమ పరీక్షకు 3,339మందిలో 3,106మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1,068మందిలో 973మంది హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. కాగా, ప్రథమ సంవత్సరం పరీక్షలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా డీబార్ చేసినట్లు వెల్లడించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామని, పలు కేంద్రాలను డీసీ, హెచ్‌పీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయని డీఐఈఓ తెలిపారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

ఖమ్మంరూరల్: విత్తనాల కొనుగోలు సమయాన రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. వానాకాలం పంటల సమీపిస్తున్న నేపథ్యాన జిల్లావ్యాప్తంగా శుక్రవారం అవగాహన సదస్సులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో నిర్వహించిన సదస్సులో డీఏఓ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకుని, పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. అలాగే, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి తప్ప గ్రామాలకు వచ్చే వారి విడి విత్తనాలు తీసుకోవద్దని సూచించారు. ఎవరైనా మోసం చేసేందుకు ప్రయత్నిస్తే వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని డీఏఓ తెలిపారు. తెలిపారు. ఈసమావేశంలో ఏడీఏ వి.నాగేశ్వరరావు, ఏఈఓ టి.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ బిల్లు తెచ్చిందే బీజేపీ..

- ఫలితంగా ఏడు మండలాలు కోల్పోయి ఉమ్మడి ఖమ్మంకు అన్యాయం
- ఆనాడే బీఆర్‌ఎస్ కొట్లాడినా పట్టించుకోలేదు
- పట్టభద్రుల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

మద్దతు పలికింది కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ మధు, వెంకటవీరయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలు, లోయర్ సీలేరు ప్రాజెక్టును ఆంధ్రాకు అప్పచెప్పింది ఈ కాంగ్రెస్, బీజేపీలు కాదా? ఆరోజు కొట్లాడింది గులాబీ జెండా. మా భద్రాచలంలో పార్కింగ్ స్థలం ఉండదు.. మా రాముల వారి గుడికి వచ్చే భక్తులకు ఇబ్బంది అవుతుందని కొట్లాడింది బీఆర్‌ఎస్. కానీ బిల్లు పెట్టిన బీజేపీకి కాంగ్రెస్ మద్దతు ఇచ్చి ఇదే రాహుల్‌గాంధీ, ఇదే కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేశాయి'. అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సత్తుపల్లిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ హక్కుల కోసం పోరాడాం..

పోరాటాలు చేసి, చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చిందే కేసీఆర్ అని హరీశ్‌రావు వెల్లడించారు. తెలంగాణ హక్కులు, ప్రయోజనాల కోసం నిజాయితీగా పోరాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో బిల్లును గట్టిగా అడ్డుకుంటే ఏడు మండలాలు ఆంధ్రాకు పోయేవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఖమ్మం జిల్లాకు, తెలంగాణకు తీవ్రమైన అన్యాయం చేసిన విషయమై మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణ కోసమే పుట్టిన బీఆర్‌ఎస్ ద్వారా హక్కుల కోసం నిక్కచ్చిగా పోరాటం సాధ్యమవుతుందని గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ సీటు బీఆర్‌ఎస్‌దే..

వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొదటి నుంచి బీఆర్‌ఎస్ గెలుస్తోందని హరీశ్‌రావు తెలిపారు. తొలుత దిలీప్‌కుమార్, ఆపై పల్లా రాజేశ్వరరెడ్డి ఇప్పుడు రాకేశ్‌రెడ్డి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పల్లాకు వేసిన ఓటు వృథా కాలేదని, పట్టభద్రులు పల్లాను రెండుసార్లు గెలిపించగా ఆయన నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కాంట్రాక్టు లెక్చరర్లు, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై నిరంతరం పనిచేశారని తెలిపారు. అదేమాదిరి రాకేశ్‌రెడ్డి కూడా అంత బాగా పనిచేయగలిగిన విద్యావంతుడని పేర్కొన్నారు.

ఒక్క హామీ అమలు కాలేదు..

ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని.. చాంతాడంత హామీలు ఇచ్చి, ఆవగింజంత కూడా అమలు చేయలేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల పేరిట బాండ్ పేపర్లు చేతుల్లో పెట్టి ఇప్పుడు చేతులెత్తేశారన్నారు. పైగా ఆరింట ఐదు అమలు చేశామని ఆ పార్టీ తప్పుడు ప్రకటనలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు మహాలక్ష్మి కింద రూ.2,500, రైతులకు రూ.7,500, ధాన్యంపై రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రూ.12వేలు, వృద్ధులకు రూ.4వేల పెన్షన్, పేదలందరికీ ఇళ్లు, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, యువతులకు స్కూటీలు, నిరుద్యోగులకు భృతి, మెగా డీఎస్సీ ఇలా అన్నీ కలగానే మిగిలాయని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇస్తామనలేదని చెప్పారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి హామీలన్నీ అమలు జరిగేలా చూస్తామని హరీశ్‌రావు తెలిపారు. ప్రతీ పట్టభద్రుడిని కలిసి రాకేశ్‌రెడ్డికి ఓటు వేసేలా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు.

రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలి..

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, బిట్స్ పిలానీలో చదివి గోల్డ్‌మెడల్ సాధించారని, ఆయన ఎమ్మెల్సీగా గెలిస్తే రైతు బిడ్డల భవిష్యత్ గొప్పగా మారుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయాన అనేక మందిపై వందల కేసులు నమోదైతే.. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నపై బ్లాక్‌మెయిల్ కారణంగా కేసులు నమోదయ్యాయని విమర్శించారు. ఈ సమావేశంలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, నాయకులు బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో నీళ్లు.. రబీలో బీళ్లు

తల్లాడ: రాష్ట్ర మంత్రులు పూటకో విధంగా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తల్లాడ మండలం నూతనకల్‌లో శుక్రవారం ఆయన సాగర్ కాల్వ, రబీలో బీళ్లుగా వదిలేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో నీటి కటకట ఏర్పడినా అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఆనాటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సాగర్ నీళ్లు విడుదల చేయించారని తెలిపారు. ఆ తర్వాత రబీలో వర్షాభావ పరిస్థితులు ఎదురైనా నీళ్లు రాక బీళ్లుగా వదిలేశామని చెప్పారు. ఈ ఏడాది ఇంకా పచ్చి రొట్ట విత్తనాలు కూడా ఇవ్వడం లేదని చెప్పగా హరీశ్‌రావు ఏఓ తాజుద్దీన్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ రైతుబంధు ఇవ్వడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలం కాగా, సన్నరకం ధాన్యానికే బోనస్ ఇస్తామంటే దొడ్డు రకాలు సాగు చేసే వారి పరిస్థితి ఏమిటన్నారు. ఈ విషయంలో మంత్రులు పూటకో మాట చెబుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు.



రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఓట్ల లెక్కింపునకు ఉద్యోగుల నియామకం

ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక

ఖమ్మం సహకారనగర్: వచ్చేనెల 4న జరగనున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈమేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు రిజర్వ్‌తో కలిపి 148 మంది సూపర్‌వైజర్లు, 173 మంది అసిస్టెంట్లు, 156 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షణ

జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, వర్షాకాలం ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరాకు ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని, కొత్త ఆవాసాలు, భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన చోట ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి విషయమై ఫిర్యాదులు అందితే సత్వరమే స్పందించి పరిష్కారం చూపాలని సూచించారు. అలాగే, పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న బావులపై అవగాహన కల్పిస్తూ, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. కాగా, గాలిదుమారం వస్తున్నందున నగరాల్లో హోర్డింగ్‌లను పరిశీలించి పటిష్టతపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించనున్న ఉద్యోగులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సెక్టార్ అధికారుల వాహనాలు, బ్యాలెట్ బాక్సులు తరలించే ఆర్టీసీ వాహనాలను జీపీఎస్‌తో సిద్ధం చేయాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఫిర్యాదులు పరిష్కరించాలని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, వివిధ శాఖల అధికారులు సదాశివకుమార్, డి.నర్సింగరావు, వినోద్, హరికిషన్, ఎం.రాజేశ్వరి, సన్యాసయ్య, కె.శ్రీరామ్, శ్రీనివాసరెడ్డి, రాంప్రసాద్, దుర్గాప్రసాద్, ఉద్యోగులు అరుణ, మదన్‌గోపాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

- జిల్లాలో పత్తి విత్తనాల కొరత లేదు..
- కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై చర్యలు
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన సీపీ సునీల్‌దత్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే బాధ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన డీలర్లు, ఏజెన్సీల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు అంటగట్టే ప్రయత్నం చేయొద్దని.. రైతులకు నష్టం కలిగేలా వ్యవహరిస్తే సహించబోమన్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచినా, అవసరానికి మించి నిల్వ చేసినా చర్యలు తప్పవని చెప్పారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ విషయంలో పోలీస్, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యాన టాస్క్‌ఫోర్స్ బందాలను ఏర్పాటుచేశామని, రైతులు ఏ మాత్రం అనుమానం ఉన్నా అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సరిపడా పత్తి విత్తనాలు

జిల్లాలో పత్తి విత్తనాల కొరత లేదని 5.25 లక్షల ప్యాకెట్లు అవసరముండగా, 5.60 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఏదైనా ఒకటే బ్రాండ్ మంచిదని చెప్పడం కాకుండా రైతులకు అవసరమైన సలహాలు ఇవ్వాలని హితవు పలికారు. బీజీ–3 పేరుతో చెలామణి అవుతున్న హెచ్‌టీ పత్తి విత్తనాలకు అనుమతి లేనందున ఈ రకం విత్తనాలు అమ్మడం, కొనటం, సాగు చేయటం నేరమని తెలిపారు. అనంతరం సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విషయంలో జిల్లాలో గత పదేళ్ల కాలంలో 50 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కొందరు ముఠాగా ఏర్పడి తక్కువ ధరకే విత్తనాలు ఇస్తామని ఆశ చూపితే రైతులు నమ్మకుండా అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, సీడ్స్ కార్పొరేషన్ ఆర్‌ఎం ఎస్.బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం సహకారనగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏఆర్‌ఓ, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన నోడల్ అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. బ్యాలెట్ బాక్సులు, పత్రాలు సిద్ధమైనందున డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. వెబ్ కాస్టింగ్ కావాల్సిన పరికరాలు సమకూర్చుకోవడమే కాక సెక్టార్ అధికారులు, బ్యాలెట్ బాక్సుల రవాణాకు కావాల్సిన వాహనాలను జీపీఎస్ పరికరాలతో సిద్ధం చేయాలని చెప్పారు. ఈసమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, ఎస్‌డీసీ రాజేశ్వరి, డీపీఓ హరికిషన్, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీఎస్‌ఓ చందన్‌కుమార్, డీఎం శ్రీలత, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్, ఉద్యోగులు అరుణ, రాంబాబు, మదన్‌గోపాల్, మీనన్ పాల్గొన్నారు.

సాగని 'సీతమ్మ సాగర్'

కేంద్ర పర్యావరణ శాఖ లేవనెత్తిన అభ్యంతరాల కారణంగా ఏడాది కాలంగా సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కేంద్రంతో చర్చించి అవసరమైన అనుమతులు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఏడాది కాలంగా నిర్మాణ పనులకు బ్రేక్

- పర్యావరణ అనుమతులపై అభ్యంతరాలు
- గతేడాది రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసుల జారీ
- అనుమతులు వస్తేనే పనులు ముందుకు



ఆగిన సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు

ఎన్జీటీ విచారణ

అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ నిర్మాణ పనుల కారణంగా తాము నష్టపోతున్నామని, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి సరైన అనుమతులు తీసుకోకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారంటూ ప్రాజెక్టు నిర్వాసితులు ఆందోళన చెందారు. దీంతో వారు ముందుగా హైకోర్టును, ఆ తర్వాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ను ఆశ్రయించారు. నిర్వాసితులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన ఎన్జీటీ నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలంటూ 2023, మే 29న ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి నివేదిక ఇవ్వాలంటూ ద్విసభ్య కమిటీని నియమించింది.

రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

ఎన్జీటీ ఆదేశాలతో మినిస్టరీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్‌లో రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్), గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డులో ఎస్‌ఈ ర్యాంక్‌కు తక్కువకాని ఇద్దరు అధికారులతో కూడిన కమిటీ జూన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించింది. నిర్వాసితులతో మాట్లాడి, రికార్డులు పరిశీలించింది. చివరకు 2023, జూలై 15న కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర పర్యావరణ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖకు 2023, సెప్టెంబరు 23న నోటీసులు జారీ అయ్యాయి. అందులో కేంద్ర పర్యావరణ శాఖ నుంచి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ (ఈసీ) రాకుండా నిర్మాణ పనులు ఎందుకు చేపట్టారో తెలపాలంటూ కోరింది. అంతర్రాష్ట్ర వివాదాలు తలెత్తే అవకాశమున్న ఈ ప్రాజెక్టు విషయంలో ఈసీ క్లియరెన్స్ లేకుండా 35 శాతం వరకు నిర్మాణ పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆగిన పనులు

గత ప్రభుత్వ హయాంలో ఓవైపు నిర్మాణ పనులు చేపడుతూనే మరోవైపు కేంద్రం నుంచి ఈసీ అనుమతుల కోసం ప్రయత్నాలు జరిగాయి. 2023 జూన్ నాటికి సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు సగానికి పైగా పూర్తి చేయాలనే లక్ష్యంతో భారీ ఎత్తున యంత్రసామగ్రి, వర్క్‌ఫోర్స్‌ను నిర్మాణ స్థలికి తరలించారు. ఇరిగేషన్ అధికారులు సమర్పించిన డీపీఆర్‌కు పదేపదే కేంద్రం కొర్రీలు వేయడంతో అనుమతులు రాలేదు. ఈ అంశంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో 2023, మే 29 నుంచి పనులు ఆపేశారు. నిర్మాణ స్థలం నుంచి భారీ యంత్రాలను తరలించారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసి గుడారాలు ఖాళీ చేశారు. ఏడాది కాలంగా నిర్మాణ ప్రదేశంలో అటున్న ఇటుక తీసి ఇటు పెట్టలేదు.

సీతారామ పూర్తయితే

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా అశ్వాపురం – దుమ్ముగూడెం మండలాల మధ్యన గోదావరి నదిపై సీతమ్మ సాగర్ పేరుతో బ్యారేజీ నిర్మిస్తోంది.

ఎప్పుడు మొదలయ్యేనో..

సీతమ్మసాగర్ బ్యారేజీ పనులపై 2023, సెప్టెంబరు 23న రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు అందాయి. అప్పటికే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. ఆ తర్వాత నవంబరులో నోటిఫికేషన్ జారీ, డిసెంబరులో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖల ఫోకస్ అంతా మేడిగడ్డ బ్యారేజీలో తలెత్తిన లోపాలపైనే కేంద్రీకృతమయ్యాయి. ఈలోగా 2024, మార్చి 16న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఫలితంగా సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల విషయంలో జాప్యం నెలకొంటోంది. మరోవైపు సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి కాలువల నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. పంప్ హౌస్‌ల నిర్మాణం పూర్తయి రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం సీతమ్మసాగర్‌కు నిర్మాణ అనుమతులు సాధించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మరింత దృఢంగా చెక్‌డ్యాం

- దానవాయిగూడెంలో మరమ్మతులకు రూ.50లక్షలతో ప్రతిపాదన
- కరకట్ట కూడా పూర్తయితే మున్నేరులో ఏడాదంతా నీటినిల్వలు





మున్నేరుపై దానవాయిగూడెం వద్ద ఉన్న చెక్‌డ్యాం (ఇన్‌సెట్) లీకేజీలతో వృథాగా పోతున్న నీరు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రజలకు తాగునీటి సరఫరా కోసం మున్నేరుపై దానవాయిగూడెం వద్ద నిర్మించిన చెక్‌డ్యాంను మరింత పటిష్టం చేయడంపై జలవనరుల శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఈ ఏడాది తీవ్రమైన కరువు పరిస్థితుల్లోనూ సాగర్ ప్రాజెక్టులో అరకొరగా ఉన్న జలాలను తాగునీటి అవసరాలకు విడదల చేయగా.. దానవాయిగూడెం వద్ద చెక్‌డ్యాంకు లీకేజీలతో వృథా అవుతోంది. నీరంతా మున్నేరు దిగువకు జారిపోవడంతో అనుకున్నంత స్థాయిలో నీటిని నిల్వ చేయలేకపోతున్నారు. ఈనేపథ్యాన మంత్రుల సూచనలతో ఈ చెక్‌డ్యాంను బలోపేతం చేయాలని నిర్ణయించారు. లీకేజీలు కాకుండా మరమ్మతులు చేపడితే వానాకాలంలోనే కాక వేసవిలోనూ లక్ష్యం మేర నీటిని నిల్వ చేయొచ్చని, తద్వారా తాగునీటికి ఢోకా ఉండదని భావిస్తున్నారు. అయితే, మున్నేరుపై దానవాయిగూడెం వద్ద రెండు మీటర్ల ఎత్తు, 264 మీటర్ల పొడవుతో ఉన్న చెక్‌డ్యాంను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.50లక్షల నిధులు అవసరమని భావిస్తూ జలవనరులశాఖ ఇంజనీర్లు అంచనాల తయారీలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మున్నేరుకు ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం రూరల్ మండలంలో ఇరువైపులా 17 కి.మీ. మేర కరకట్ట నిర్మాణానికి రూ.690 కోట్లు మంజూరయ్యాయి. ఈమేరకు అటు కరకట్ట నిర్మాణం పూర్తయి, చెక్‌డ్యాంను కూడా బలోపేతం చేస్తే నీరు సమృద్ధిగా నిలిచి వేసవిలో కూడా నగర వాసులకు తాగునీటి ఎద్దడి ఎదురుకాదని అధికారులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

● భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో వర్షాకాలంలో ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖ, వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 15 నుంచి సమస్యాత్మక గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయిస్తామని, గత మూడేళ్ల డేటా ఆధారంగా మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే గ్రామాలను గుర్తించి ముందస్తు వైద్య శిబిరాలు నిర్వహించాలని వివరించారు. వలస గొత్తికోయ గ్రామాల్లో వైద్య సేవలందించాలని తెలిపారు. రక్తం తక్కువగా ఉన్న గర్భిణులకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలని, ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా ఇప్పించాలని కోరారు. చిన్నపిల్లల్లో మాల్ న్యూట్రిషన్ ఉంటే ఐసీడీఎస్ సిబ్బంది సహకారంతో గుర్తించి భద్రాచలంలోని ఎన్ఆర్‌సీ సెంటర్ తరలించి, చికిత్స అందించాలని సూచించారు.

పనుల్లో వేగం పెంచాలి

● జెన్‌కో సీఎండీ ముర్తుజా అలీ

మణుగూరు టౌన్: బీటీపీఎస్‌లో బీహెచ్‌ఈఎల్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ ఆదేశించారు. శుక్రవారం ఆయన భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ప్లాంట్ సీఈ బిచ్చన్నతో కలిసి విద్యుదుత్పత్తి, యూనిట్ల పనితీరును పరిశీలించారు. అనంతరం ప్లాంట్ పనుల తీరుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ పనులు చివరి దశకు చేరడంతో మిగిలిన పనుల వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, బీహెచ్‌ఈఎల్ జీఎం అజిత్ వర్మ, ఇంజనీర్లు, ఏజీఎం పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో కార్మికుడికి గాయాలు

బీటీపీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ కార్మికుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తొలుత కొత్తగూడెం, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బొగ్గు కన్వేయర్ బెల్ట్ వద్ద పనిచేస్తున్న షేర్ జైపాల్‌కు తెల్లవారుజామున 3 గంటలకు చేయికి తీవ్ర గాయమైంది. దీంతో కార్మికుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రూ.లక్ష నగదు చోరీ

వైరా: వైరా మున్సిపాలిటీ 7వ వార్డు పరిధి పరిధి బ్రాహ్మణపల్లిలో చోరీ జరిగింది. బ్రాహ్మణపల్లికి చెందిన కొంగర నాగేశ్వరరావు రెండు రోజుల ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న తమ కుమారుడి ఇంటికి వెళ్లారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తాళం సైతం పగులగొట్టి రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపు తీసి ఉండడాన్ని గమనించిన పక్కింటి వారు ఇచ్చిన సమాచారంతో నాగేశ్వరరావు చేరుకుని పరిశీలించారు. బీరువా లాకర్‌లోని బంగారం అలాగే ఉండగా రూ.లక్ష నగదు చోరీ అయినట్లు చేసిన ఫిర్యాదుతో పోలీసులు ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని లచ్చగూడెంలో ఓ వివాహ సంబంధం రద్దయిన అంశంపై రెండు కుటుంబాల జరిగిన ఘర్షణకు సంబంధించి ఎనిమిది మందిపై కేసు నమోదైంది. వివాహ విషయంలో కొంతకాలంగా గడవలు జరుగుతుండగా, ఈనెల 21న పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో మడుపల్లి అంజమ్మతో పాటు ఆమె భర్త మల్లయ్య గాయపడ్డారు. దీంతో అంజమ్మ ఫిర్యాదు మేరకు లింగబోయిన నర్సింహారావు సహా ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఖమ్మంక్రైం: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం మోతీనగర్‌కు చెందిన సాయిని శ్రీను (29) ఫ్లెక్సీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవతో ఆయన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను శుక్రవారం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనపై ఆయన తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీ టౌన్ సీఐ రమేష్ తెలిపారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముగ్గురు మావోయిస్టులు దంతెవాడ అదనపు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. అదనపు ఎస్పీ రాంకుమార్ కథనం మేరకు.. మయిన్‌గూర్ ఏరియాకు చెందిన ముగ్గురు మావోయిస్టులు పార్టీ సిద్ధాంతాలు నచ్చక లొంగిపోయేందుకు నిర్ణయించుకొని తమ వద్దకు వచారని తెలిపారు. లొంగిపోయిన వారికి తక్షణ పునరావాసం కింద ఒక్కొక్కరికీ రూ.25 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. లొంగిపోయినవారిలో ఒక మహిళా మావోయిస్టు కూడా ఉంది.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,229

'కారుణ్య' మిస్టరీ..?

● ప్రైవేట్ నర్సింగ్ కళాశాల వద్ద ఉద్రిక్తత
● మృతురాలి కుటుంబ సభ్యుల ఆందోళన
● పోలీసులకు, దళిత సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం



పోలీసులతో కారుణ్య కుటుంబ సభ్యులు, బంధువుల వాగ్వాదం

భద్రాచలంఅర్బన్: నర్సింగ్ విద్యార్థిని కారుణ్య మృతికి గల కారణాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. తల్లిదండ్రులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం విద్యార్థిని కుటుంబీకులు, బంధువులు కళాశాల వద్ద ఆందోళన చేపట్టగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులకు, దళిత సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం నెలకొంది. వివరాలు ఇలా.. భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న పడిగిపల్లి కారుణ్య (18) గురువారం అనుమానాస్పదస్థితిలో కళాశాల భవనంపై నుంచి కింది పడింది. తీవ్ర గాయాలుకాగా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబీకులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఉదయం కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరసన తెలిపారు. ఆందోళనకు పలు దళిత సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

కళాశాల బాధ్యులపై దాడి

ఆందోళన సమయంలోనే కళాశాల కార్యదర్శి ఎస్ఎల్ కాంతారావు అక్కడికి రాగా, మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆయన్ను కారులో నుంచి బయటకు లాగి దాడి చేశారు. దీంతో పోలీసులు కాంతారావును కళాశాలలోని ప్రిన్సిపాల్ గదికి తరలించారు. ఈ క్రమంలో ఆందోళన మరింత తీవ్రతరం చేశారు. యాజమాన్యం అకారణంగా విద్యార్థిని పొట్టనబెట్టుకుందని ఆరోపించారు. ఉన్నతాధికారులు కళాశాల వద్దకు రావాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తన కూతురు మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్యాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించాలని మృతురాలి తల్లి సునీత డిమాండ్ చేశారు. తన కూతురి చావుని కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, ఆమె స్నేహితురాలిని తీసుకొస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.



రోదిస్తున్న విద్యార్థిని తల్లి సునీత

ఎమ్మెల్యేకు, దళిత సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం

ఆందోళన జరుగుతుండగానే అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని చెబుతుండగా, దళిత సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో మృతురాలి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కళాశాల యాజమాన్యంపై దాడికి పాల్పడేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా మధ్యవర్తుల సమక్షంలో కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షలు ఇచ్చేలా యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. కాగా కారుణ్య మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని మృతురాలి తండ్రి గురుమూర్తి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

మృతిపై పలు అనుమానాలు

విద్యార్థిని కారుణ్య మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థిని ఫిట్స్‌తో చనిపోయిందని, హాస్టల్ మొదటి అంతస్తు పైనుంచి పడి తీవ్ర గాయాలతో మృతిచెందిందని, గుర్తుతెలియని దుండగుడు దాడి చేశాడనే వాదనలు వినిపించాయి. ఏడు పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిందని శుక్రవారం మరో వాదన వెలుగుచూసింది. నర్సింగ్ కళాశాల నిర్వాహకుడి కుమారుడు కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, తనమాట వినకపోవడంతో దాడికి పాల్పడ్డాడని, దీంతో విద్యార్థిని మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, కారుణ్య మృతికి అసలు కారణం మాత్రం మిస్టరీగానే మిగిలిపోయింది.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే సమస్యల పరిష్కారం

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే రాగమయి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పక్కన ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లి: పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న తీన్మార్ మల్లన్నకు ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి పాటుపడతారని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలను బయటపెట్టినందుకే మల్లన్నపై కేసులు బనాయించినా ప్రజల పక్షానే నిలిచారని తెలిపారు. కాగా, హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా చేస్తారని, తెలంగాణను యూటీగా మారుస్తారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పలేక తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ మట్టి, ఇసుక, ఆయిల్, బెట్టింగ్, పేకాట మాఫియా నడిపించిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అనుచరులదేనని మండిపడ్డారు. ఇప్పుడు అలాంటివి తాము ప్రోత్సహిస్తున్నట్లు నిరూపిస్తే రాజీనామాకైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. కాగా, కల్లూరు చర్చి గోడల ధ్వంసం వివాదంతో తమకెలాంటి సంబంధం లేదని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివవేణు, నాయకులు రాయల నాగేశ్వరరావు, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, పసుమర్తి చందర్‌రావు, నారాయణవరపు శ్రీనివాసరావు, గాదె చెన్నారావు, వీరివాడ నాగభూషణం, దూదిపాల రాంబాబు, సోమిరెడ్డి, మానుకోట ప్రసాద్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు పీఆర్‌టీయూ మద్దతు



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు మద్దతు ఇస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగిస్తామని సీఎం తమకు హామీ ఇచ్చారని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావుతో పాటు మోతుకూరి మధు, బీరెల్లి కమలాకర్‌రావు, వెంకటేశ్వరరావు, తాళ్లూరి చంద్రశేఖరరావు, సైదయ్య, రాయల నర్సింహారావు, వెంకటనర్సయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత వాగ్దానాలే...

మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి



వైరాలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన నాయకులు

వైరా/తల్లాడ: తెలంగాణలో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైరా, తల్లాడలో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నిరుద్యోగ, పట్టభద్రులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ రూ.7 లక్షల కోట్లు అప్పులు చేయగా.. ఆ పార్టీ నాయకులు రూ.వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం ఎదురైందని తెలిపారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పుడే చీలికలు మొదలుకాగా, ధాన్యం కొనుగోళ్లలో కుంభకోణం జరిగిందని ఆయన విమర్శించారు. ఏదిఏమైనా కేంద్రంలో మరోమారు బీజేపీ గెలిచి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డి గెలిపిస్తే మండలిలో నిరుద్యోగ సమస్యలపై పోరాడే అవకాశం ఉంటుందని సుధాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే, సత్తుపల్లిలో మట్టి మాఫియాలో పాత బీఆర్ఎస్, కొత్త కాంగ్రెస్ నాయకులు ఉన్నట్లు తెలుస్తుండగా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో బీజేపీ నాయకులు రంగా కిరణ్, నెల్లూరి కోటేశ్వరరావు, ఏపూరి శ్రీనివాసరావు, వెంకటకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షణ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, వర్షాకాలం ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరాకు ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని, కొత్త ఆవాసాలు, భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన చోట ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి విషయమై ఫిర్యాదులు అందితే సత్వరమే స్పందించి పరిష్కారం చూపాలని సూచించారు. అలాగే, వ్యవసాయ భూముల్లో ప్రమాదకరంగా ఉన్న బావులపై అవగాహన కల్పిస్తూ, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. కాగా, గాలిదుమారం వస్తున్నందున నగరాల్లో హోర్డింగ్‌లను పరిశీలించి పటిష్టతపై నివేదిక ఇవ్వాలని సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించనున్న ఉద్యోగులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సెక్టార్ అధికారుల వాహనాలు, బ్యాలెట్ బాక్సులు తరలించే ఆర్టీసీ వాహనాలను జీపీఎస్‌తో సిద్ధం చేయాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు పరిష్కరించాలని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమీషనర్ ఆదర్శ్ సురభి, వివిధ శాఖల అధికారులు సదాశివకుమార్, డి.నర్సింగరావు, వినోద్, హరికిషన్, ఎం.రాజేశ్వరి, సన్యాసయ్య, కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మ ఇంటికి వచ్చి అనంతలోకాలకు...

● మామలతో మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
● తలకు తీవ్రగాయం కావడంతో ఆరేళ్ల బాలుడు మృతి



రితీష్ (ఫైల్)

తిరుమలాయపాలెం: సెలవుల్లో సరదాగా గడిపేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలుడిని ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు వెంటాడింది. అంతసేపు సరదాగా గడిపిన బాలుడు ప్రమాదంలో గాయపడి మృత్యువాత పడ్డాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలోని కేజీబీవీ సమీపాన జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కలంచెరువుకు చెందిన బలగాని కవిత – వెంకన్న చిన్న కుమారుడు రితీష్(6) వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఊరైన ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని ముత్తగూడెం వచ్చాడు. వీరి ఇంట్లో త్వరలోనే ఫంక్షన్ ఉండగా మేనమామలు కాసాని కరుణాకర్, వెంకన్న పాలేరు సంతలో గొర్రెపోతులు తెచ్చేందుకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా రితీష్ కూడా బయలుదేరాడు. రెండు గొర్రెపోతులు తీసుకుని వాటిని మధ్యలో పెట్టుకుని వస్తుండగా రితీష్ బైక్ ముందు భాగాన కూర్చున్నాడు. ఇంతలోనే తిరుమలాయపాలెం కేజీబీవీ వద్ద ఆగి ఉన్న కారును వీరి బైక్ ఢీకొట్టడంతో పెట్రోల్ ట్యాంక్‌పై కూర్చున్న రితీష్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయనను తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి తరలించగా మృతి చెందాడు. ఈ ఘటనలో ఒక గొర్రెపోతు కూడా మృతి చెందగా కరుణాకర్, వెంకన్నకు స్వల్ప గాయాలయ్యాయి. సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చిన రితీష్ మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గాలిదుమారం బీభత్సం

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని చంద్రుపట్ల, చెన్నూరు తదితర గ్రామాల్లో గురువారం రాత్రి గాలిదుమారం బీభత్సాన్ని సృష్టించింది. చెన్నూరు నారుమళ్ల బజార్‌లో పలువురి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోగా, చంద్రుపట్లలో పరిగడుపు సుజాతకు చెందిన రేకుల ఇల్లు పూర్తిగా పడిపోయింది. అలాగే, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం షెడ్డు కూడా కూలింది. కాగా, రేకులు గాలికి ఎగిరి విద్యుత్ స్తంభాలపై పడగా తీగలు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే, కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు కూడా ఒరిగాయి. పలు గ్రామాల్లోని తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి.



గాలిదుమ్ముకు పడిపోయిన రేకుల షెడ్



పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

సింగరేణి డైరెక్టర్లతో ఆస్ట్రేలియా బృందం భేటీ



ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్‌తో సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ డైరెక్టర్లతో ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్ బృందం కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం భేటీ అయింది. సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించగా.. అవసరమైన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విషయంలో ఆస్ట్రేలియా బృందం చర్చించింది. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ పరిధిలో గనులు, ప్రస్తుతం అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి, రవాణా తదితర అంశాలను వివరించారు. అలాగే, వ్యాపార విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లపై చర్చించారు. అనంతరం ఆస్ట్రేలియా కమిషనర్ డేనిస్ ఈటెన్ మాట్లాడుతూ వారిదేశంలో బొగ్గు రంగంలో అమలవుతున్న సాంకేతికత, వ్యాపార అవకాశాలను తెలుసుకుని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకునేందుకు సింగరేణి డైరెక్టర్లను ఆహ్వానించారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా బృందం కొత్తగూడెంలోని పీవీకే-5 ఇంక్‌లైన్ గనిని సందర్శించింది. ఈ సమావేశాల్లో సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు, ఉద్యోగులు బి.రవీందర్, పాలడుగు శ్రీనివాస్, బృందం సభ్యులు రామకృష్ణ, మనీష్ భట్టి, ఆస్ట్రేలియా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎనిమిదికి చేరిన ఎన్‌కౌంటర్ మృతులు



ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు – పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పుల పరంపర కొనసాగుతూనే ఉంది. గురువారం దంతెవాడ – బీజాపూర్ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. అయితే, రాత్రి కావడంతో మృతదేహాలను తరలించే ప్రక్రియను నిలిపివేసిన భద్రతా బలగాలు శుక్రవారం ఉదయం ఆ పనికి ఉపక్రమించాయి. ఇంతలోనే మళ్లీ మావోయిస్టులు కాల్పులకు దిగగా, పోలీసులు సైతం కాల్పులు మొదలుపెట్టగా మరో మావోయిస్టు మృతి చెందాడు. ఘటనాస్థలి నుంచి అత్యాధునిక ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపారు. మూడు రోజుల నుంచి కొనసాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసు బలగాలు విజయం సాధించాయని ఆయన వెల్లడించారు. కాగా, మావోల మృతదేహాలను దంతెవాడ జిల్లా కేంద్రానికి తరలించాక గుర్తించే ప్రక్రియ చేపడతామని ఆయన తెలిపారు.

రైలు కింద పడిన జంట

● బాలిక మృతి, యువకుడికి తీవ్ర గాయాలు
● ఖమ్మం బాలికకు వరంగల్ యువకుడితో ఫోన్‌లో పరిచయం
● ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిన బాలిక

కాశిబుగ్గ(వరంగల్): ఓ జంట రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో బాలిక చనిపోగా, యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన వరంగల్ రైల్వేస్టేషన్‌కు సమీపాన పోతన జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గకు చెందిన మేకమల్ల చెన్నకేశవ(19)కు ఖమ్మం సారథినగర్‌కు చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక(17)తో పరిచయమైంది. ఫోన్‌లో వీరు తరచూ మాట్లాడుతుండగా బాలికను తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె గురువారం ఎవరికి చెప్పకుండా బయటకు వచ్చింది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయాన తన తల్లికి ఫోన్ చేసి తాము చనిపోతున్నామని చెప్పి డౌన్‌లైన్‌లో వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడ్డారు. ఈ ఘటనలో బాలిక అక్కడికక్కడే మృతి చెందగా, చెన్నకేశవ కాళ్లు తెగి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు 108లో చెన్నకేశవను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, బాలిక అదృశ్యంపై ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, ఆమె బంధువులు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని సీఐ తెలిపారు.

అమ్మా చనిపోతున్నా.. నా కోసం వెతకొద్దు

ఖమ్మంక్రైం: అమ్మా నేను చనిపోతున్నాను... నా కోసం వెతకొద్దు అని చెప్పిన నిమిషాల్లోనే ఖమ్మంకు చెందిన మైనర్ బాలిక వరంగల్ – కాజీపేట మధ్య రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం సారథినగర్‌కు చెందిన బాలిక (17) ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకుల ఫిర్యాదుతో ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. ఇంతలోనే శుక్రవారం సాయంత్రం బాలిక తల్లి పోలీసుస్టేషన్‌కు వచ్చి తన కుమార్తె ఆచూకీ విషయమై సీఐ రమేష్‌తో మాట్లాడుతోంది. అదేసమయాన ఆమెకు ఫోన్ చేసిన బాలిక 'నేను చనిపోతున్నాను.. నా కోసం వెతకొద్దు' అని చెప్పి కట్ చేసింది. దీంతో ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ సెల్ ఫోన్ లోకేషన్ ఆధారంగా వరంగల్ – కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య ఉన్నట్లు గుర్తించి ఖమ్మం ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన సిబ్బందిని అప్రమత్తం చేసి ఘటనాస్థలికి వెళ్లేలోగా బాలికతో పాటు ఉన్న యువకుడు అహ్మదాబాద్ వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కిందపడ్డారు. ఈ ఘటనలో బాలిక అక్కడికక్కడే మృతిచెందగా యువకుడి కాలు తెగిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.